క్లుప్తంగా

వృద్ధులకు కంటి వెలుగు తెచ్చిన సీఎం

మార్కాపురం: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని వృద్ధులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉచితంగా ఆపరేషన్ చేయించి అద్దాలు ఇవ్వటం ద్వారా వారి జీవితాల్లో వెలుగు తెచ్చాడని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ అన్నారు. శుక్రవారం భగత్‌సింగ్ కాలనీ 10వ సచివాలయం పరిధిలో ఆయన కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఏటా కంటి వెలుగు పథకాన్ని అన్ని సచివాలయాల పరిధిలో అమలు చేస్తామని చెప్పారు. పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు డి.బాబీ, సిబ్బంది మహాలక్ష్మి, నాసర్‌వలి, కమలా, నారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలపై పట్టు సాధించాలి

కంభం: విద్యార్థులు అభ్యసన నైపుణ్యాలపై పట్టు సాధించడంతో పాటు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని కాంప్లెక్స్ చైర్మన్ కె.శర్వాణి అన్నారు. శుక్రవారం స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఆమె సందర్శించారు. పాఠశాలలోని అన్ని తరగతుల విద్యార్థినుల రాత నైపుణ్యాలు, అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పరిసరాలు, సౌకర్యాలను వీక్షించారు. బాలికా విద్యా ఆవశ్యకతను వివరిస్తూ బాలికలు చదువుతో పాటు సామాజిక స్పృహ, సంస్కార శైలి కలిగి ఉండాలని సూచించారు. ప్రిన్సిపాల్ పి.చాముండేశ్వరి, సీఆర్పీ రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

వైఎస్సార్ కంటి వెలుగుతో మేలు

తాళ్లూరు: వైఎస్సార్ కంటి వెలుగుతో విద్యార్థులకు దృష్టిలోపం గుర్తించి వారికి తక్షణమే తగిన సూచనలు చేసి భవిష్యత్‌లో ఎంటువంటి దృష్టి లోపం లేకుండా పథకం ఎంతో ఉపయోకరంగా ఉందని వైస్ ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. కస్తూరిబా పాఠశాలలో శుక్రవారం వైస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి ఖాదర్‌మస్తాన్‌బీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ కీర్తి, ఎంఈవో జి.సుబ్బయ్యలు పథకం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. సర్పంచి వలి, ఎంపీటీసీ యామర్తి ప్రభుదాస్, కో ఆప్షన్ మెంబర్ కరిముల్లా పాల్గొన్నారు.

నేడు గృహసారథులకు అవగాహన సదస్సు

పొదిలి రూరల్: పొదిలి–దర్శి రోడ్డులోని సాయి కల్యాణ మండపంలో శనివారం ఉదయం పొదిలి నగర పంచాయతీ పరిధిలో నూతనంగా ఎంపికైన గృహసారథులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు షేక్ నూర్జహాన్, దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సదస్సులో మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. పొదిలి నగర పంచాయతీకి సంబంధించి వార్డు అధ్యక్షులు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ అనుబంధ విభాగాలకు చెందిన ముఖ్య నాయకులు, డైరెక్టర్లు, వలంటీర్లు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

విద్యుత్ లైన్‌మన్ సస్పెన్షన్

పొదిలి రూరల్: పొదిలి నగర పంచాయతీలోని నవాబ్‌మిట్టలో విద్యుత్ లైన్‌మన్‌గా పని చేస్తున్న శివరామకృష్ణను అధికారులు సస్పెండ్ చేశారు. ఇటీవల కాలంలో నవాబు మిట్టలోని ఓ ఇంట్లో మీటర్ బిగించేందుకు రెండు వేల రూపాయలు శివరామకృష్ణ లంచం డిమాండ్ చేసినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందింది. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరపగా మొబైల్ ఆడియో రికార్డు ద్వారా రుజువు కావడంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఉన్నతాధికారులు శుక్రవారం ఆయన్ను సస్పెండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బేస్తవారిపేట: మండలంలోని పందిళ్లపల్లె, మోక్షగుండం, పెంచికలపాడు, పూసలపాడు గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఇన్‌చార్జి ఏఈ సన్యాసిరావు తెలిపారు. పందిళ్లపల్లె సమీపంలోని జగనన్న హౌసింగ్ కాలనీలో విద్యుత్ పనుల కోసం సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- త్రిపురాంతకం మండలం మేడపిలో గడప గడపకు మన ప్రభుత్వం



మేడపి ఎస్టీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

త్రిపురాంతకం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతికి నవరత్నాల ద్వారా కృషి చేస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. త్రిపురాంతకం మండలం మేడపి ఎస్టీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీ కాలనీవాసులు మంత్రి సురేష్‌కు ఘన స్వాగతం పలికారు. ప్రతి కుటుంబానికి సంక్షేమం అందేలా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. నవరత్నాల ద్వారా ప్రతి ఒక్కరినీ ఆదుకునేందుకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని చెప్పారు. కరోనా సమయంలో ప్రజల ఇబ్బందులు చూసిన ముఖ్యమంత్రి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజల అకౌంట్లలో జమచేశారని వివరించారు. ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటారని వివరించారు. గతంలో కార్యాలయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం కనిపించలేదని, నేడు ప్రభుత్వ అధికారులే గడప గడపకు వచ్చి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నారని చెప్పారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది గ్రామాల్లో లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వివరించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను స్థానికంగా ఉన్న అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పక్కాగృహాలు, నివాస స్థలాలు, పింఛన్లు అర్హులైన వారందరికీ అందేలా చూడాలని, సమస్యలు ఏమైనా ఉంటే వాటిని పరిష్కరించాలని సురేష్ ఆదేశించారు. మంత్రి సురేష్‌ను ప్రజలు ఆప్యాయంగా పలకరిస్తూ ఆహ్వానించారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో బీవీఎస్ సాయికుమార్, తహసీల్దార్ వీ కిరణ్, ఎంపీడీవో మరియదాస్, ఎంఈఓ కె తులసి మల్లికార్జుననాయక్, ఏఓ నీరజ, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, గ్రామసర్పంచ్ గుమ్మా యల్లమ్మ, ఎంపీటీసీ కృష్ణ, వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి, కో కన్వీనర్ యల్లారెడ్డి, పార్టీ నాయకులు దగ్గుల గోపాల్ రెడ్డి, స్థానిక నాయకులు నల్లూరి నాగేశ్వరరావు, గుమ్మ చిన్న వీరయ్య, వెంకటనారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ ప్రయోజనాలు చెప్పాలి



కిట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- గృహసారథుల సమీక్షలో ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం ద్వారా ఆ కుటుంబం పొందిన లబ్ధిని వివరించాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కోరారు. పట్టణంలోని ద్వారకా బజారులో మాల్యవంతుని పాడు, నాయుడుపల్లి, నికరంపల్లి, పెద్దనాగులవరం, పెద్దయాచవరం, రామచంద్రాపురం, రాయవరం, తిప్పాయపాలెం, వేములకోట గ్రామాల గృహసారథులు, వలంటీర్‌లు, సచివాలయ కన్వీనర్‌ల శిక్షణ కార్యక్రమానికి శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలులో వలంటీర్లు, కన్వీనర్‌లతో కలిసి ప్రతి గృహాన్ని సందర్శించి అర్హులైన ప్రతి కుటుంబానికి పథకాలు అమలయ్యేలా చూడటంతో పాటు పర్యవేక్షించాల్సిన బాధ్యత గృహసారథులపైన ఉందని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాల అమలులో 99 శాతం హామీలు నేరవేర్చారు కనుక ముఖ్యమంత్రి చెప్పినట్లు రాష్ట్రంలో 175 స్థానాలు గెలవాలని, అందుకు గృహసారథులు, కన్వీనర్‌లు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలన్నారు. ప్రజలతో మమేకం కావాలన్నారు. పథకాలు అమలులో కుల, మత, వర్గ పార్టీలు చూడకుండా అర్హులకు వర్తింపజేయాలన్నారు.

పశ్చిమ ప్రకాశంపై సీఎం శ్రద్ధ

పశ్చిమ ప్రకాశంపై సీఎం ప్రత్యేక దృష్టి పెట్టారని అందులో భాగంగా వెలుగొండ నిర్వాసితులలో ఒక్కో కుటుంబానికి రూ.12.50 లక్షల ప్యాకేజీ ఇచ్చారని, త్వరలో వెలుగొండ పూర్తి అవుతుందని ఎమ్మెల్యే కేపీ చెప్పారు. జిల్లాలో మార్కాపురం కేంద్రంగా మెడికల్ కాలేజీ ఏర్పాటుతో పనులు జరుగుతున్నాయన్నారు. వలంటీర్లలో ప్రధానంగా మహిళ వలంటీర్లు 50 శాతం మంది ఉన్నారని, ఇంటింటికీ ప్రతి మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తూ ఆ ఇంట్లో ప్రభుత్వం వల్ల కలిగిన లబ్ధిని వివరించాలన్నారు. ఎంపీపీ అరుణచెంచిరెడ్డి, జెడ్పీటీసీ బాపన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు లక్ష్మమ్మ, బండి లక్ష్మీదేవి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వీరనారాయణమ్మ, అరుణ, మల్లయ్య, వీరయ్య, పొందుగుల శ్రీనివాసరెడ్డి, జానపాటి ఆవులయ్య, వేమారెడ్డి, శివారెడ్డి, టి.రామిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం గృహసారథులకు కిట్‌లు అందజేశారు.

వైద్య రంగానికి సీఎం అధిక ప్రాధాన్యత

- రాష్ట్రంలో 11 వైద్య కళాశాలలు ఏర్పాటు చేశారు
- రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



పీహెచ్‌సీ నూతన భవన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి సురేష్ తదితరులు

త్రిపురాంతకం: గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యం బాగుండాలనే ఉద్దేశంతో వైద్య రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో 11 వైద్య కళాశాలలు ప్రారంభించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. త్రిపురాంతకం మండలం అన్నసముద్రంలో రూ.1.67 కోట్లతో నిర్మించిన పీహెచ్‌సీ నూతన భవన సముదాయాన్ని మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో నిష్ణాతులైన వైద్యులతో వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీలో ఆధునిక యంత్ర పరికరాలు అందుబాటులో ఉన్నాయని, గ్రామీణ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో అత్యాధునిక వైద్యం కోసం యర్రగొండపాలెం, పెద్దదోర్నాలల్లో వైద్యశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే త్రిపురాంతకం, దూపాడు పీహెచ్‌సీలను నాడు–నేడు కింద అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో వైద్యసేవలను ప్రజలకు మరింత అందుబాటులోకి తెచ్చామన్నారు. వైద్యసేవలు మెరుగైతే మనిషి జీవన ప్రమాణం 85 ఏళ్లకు పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పేదల ఆరోగ్యం కోసం ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొచ్చిన వైఎస్సార్ బాటలోనే జగనన్న కూడా ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో ముందున్నారని అన్నారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ రాజ్యలక్ష్మి, డీవైఎంహెచ్‌ఓ రాహుల్, డీఎల్‌డీఓ సాయికుమార్, పంచాయతీరాజ్ డీఈ సుబ్బారెడ్డి, తహసీల్దార్ వి.కిరణ్, ఎంపీడీఓ మరియదాస్, వైద్యాధికారులు కరుణ్, స్నేహ, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆర్.సుశీల వెంకట పిచ్చయ్య, గ్రామ సర్పంచ్ వి.వెంకటరమణ, ఉపసర్పంచ్ కె.వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం కొత్త అన్నసముద్రం గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను మంత్రి ప్రారంభించారు.

నిర్మమహేశ్వర దేవస్థానం చైర్మన్‌గా యక్కలి

- నేడు ప్రమాణస్వీకారం



నూతన చైర్మన్ యక్కలి శేషగిరిరావు

పొదిలి రూరల్: పొదిలి నిర్మమహేశ్వర స్వామి దేవస్థానానికి ప్రభుత్వం 8 మందితో కొత్త కమిటీని నియమించింది. ఈ మేరకు శుక్రవారం దేవదాయ శాఖ ఉత్తర్వుల జారీ చేసింది. ఆలయ నూతన కమిటీ సభ్యులుగా యక్కలి శేషగిరిరావు, కొలగట్ల అంజిరెడ్డి, గొలమారి నాగమణి, పులుకూరి నాగేశ్వరరావు, మునగాల లక్ష్మీ సుజాత, పావులూరి నాగమణి, గంజి సుబ్బారావు, సుబ్బా నరసయ్యలను నియమించారు. వీరితో దేవదాయ శాఖ అధికారులు శనివారం ఉదయం ప్రమాణ స్వీకారం చేయిస్తారు. నూతన చైర్మన్‌గా వైఎస్సార్ సీపీ రాష్ట్ర వాణిజ్య కార్యదర్శి యక్కలి శేషగిరిరావు ఎన్నుకుంటారు. శేషగిరిరావు నిర్మమహేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌గా ముచ్చటగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేస్తున్నారు.

పోలీసుస్టేషన్‌లో కౌన్సిలర్ నిరసన

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ కౌన్సిలర్ దొంత లక్ష్మీదేవి శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని తాళ్లపల్లెలో జనవరి 31వ తేదీన గజ్జా రాజశేఖర్‌కు అతడి సమీప బంధువు సూర్య పెద్దన్నకు కుటుంబ విషయమై ఘర్షణ జరిగింది. ఆ కేసుకు సంబంధించి గజ్జా రాజశేఖర్, వెంకట రంగయ్య, రవి, చంద్రకళ అనే నలుగురిపై సూర్య పెద్దన్న కేసు పెడితే కేవలం రాజశేఖర్‌పైనే కేసు ఎలా నమోదు చేస్తారంటూ కౌన్సిలర్ దొంత లక్ష్మీదేవి పోలీసులను ప్రశ్నించారు. సీఐ ఫిరోజ్ ఆమె వద్దకు వచ్చి కేసుపై నిజాలు తెలుసుకుని చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆమె అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ విషయమై ఎస్ఐ బ్రహ్మనాయుడిని వివరణ కోరగా రాజశేఖర్, అతడి భార్య అన్న సూర్యపెద్దన్నలకు కుటుంబ విషయంలో ఘర్షణ పడ్డారు. ఆ ఘర్షణలో గాయాలపాలైన సూర్యపెద్దన్న గిద్దలూరు ఏరియా వైద్యశాలలో చికిత్స కోసం చేరాడు. వైద్యశాలలో కేవలం రాజశేఖర్ పేరు మాత్రమే నమోదు చేయించారు. వైద్యశాలలో వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాత్రమే ఒక్కరిపైనే కేసు నమోదు చేశామని చెప్పారు.

నేను జగనన్న సేవకుడిని

- కె.కొత్తపల్లి గడప గడపలో ఎమ్మెల్యే కేపీ



పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: తాను జగనన్న సేవకుడినని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మార్కాపురం నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నానని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. మండలంలోని కె.కొత్తపల్లిలో శుక్రవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులతో మాట్లాడారు. కుల, మత, వర్గ, పార్టీ భేదాలు లేకుండా అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నూరు శాతం అమలు చేసిన ఘనత మన ప్రభుత్వానికే దక్కుతోందన్నారు. నాడు–నేడు ద్వారా అటు పాఠశాలలు, ఇటు వైద్యశాలలు రూపు రేఖలు మారాయని చెప్పారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో విదేశాల్లో ఉన్నత చదువులు చదువుకునేందుకు జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని కూడా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రైతులను ఆదుకునే ఉద్దేశ్యంతో ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతు భరోసా ద్వారా రైతులకు ఆర్థిక సాయం అందిస్తున్నారని చెప్పారు. అర్హులైన అవ్వా, తాతలకు ఒకటో తేదీన పెన్షన్ ఇస్తున్నారని చెప్పారు. ఇవ్వని హామీలను కూడా సీఎం వైఎస్ జగన్‌మోహ రెడ్డి చేస్తున్నారని ఎమ్మెల్యే కేపీ స్పష్టం చేశారు. గ్రామస్తులు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ అరుణా చెంచి రెడ్డి, జెడ్పీటీసీ బాపనరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ కొండయ్య, సర్పంచిలు శ్రీరాములు, సుబ్బా రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ పోలయ్య, నాగరాజు, ఎంపీడీఓ చందన పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

- డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి



రోగుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ

పొదిలి రూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. తొలుత రికార్డులు పరిశీలించారు. ఆ తర్వాత సిబ్బంది పనితీరుపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆల్ నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్స్ గురించి సమీక్ష చేశారు. ఆస్పత్రి పనితీరు మెరుగు పడాలన్నారు. అనంతరం మాదాలవారిపాలెంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ప్రోగ్రాం అమలు తీరును ఆమె పరిశీలించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ డాక్టర్లు అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందించాలన్నారు. వైద్యాధికారులు డాక్టర్ సుష్మ, డాక్టర్ నరేంద్ర, సీహెచ్‌ఓ విజయలక్ష్మి, హెచ్‌ఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

గిద్దలూరు రూరల్: రైలు కిందపడి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన పట్టణంలోని విఠా సుబ్బరత్నం కల్యాణ మండపం సమీపం రైల్వే ట్రాక్ వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. అందిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి హుబ్లీ వైపుగా వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు వస్తున్న సమయంలో ట్రాక్ పక్కనే ఉన్న ఓ యువకుడు ఆకస్మాత్తుగా రైలు పట్టాలపైకి వచ్చినట్లు రైలు డ్రైవర్ స్థానిక గిద్దలూరు రైల్వేస్టేషన్‌లో సమాచారం అందించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అతడి వద్ద ఎటువంటి ఆధారాలు లేవని తెలిపారు.

అక్రమ కట్టడాలు, అనధికార లేఔట్‌లపై చర్యలు

- మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆర్‌డీడీ మధుకుమార్

మార్కాపురం టౌన్: అక్రమ కట్టడాలు, అనధికార లేఔట్‌లపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ పట్టణ విభాగ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ పి.మధుకుమార్ చెప్పారు. శుక్రవారం ఆయన మార్కాపురం మున్సిపాల్టీలోని నిర్మాణంలో ఉన్న వివిధ భవనాలు, వాటి రికార్డులు తనిఖీ చేసి సచివాలయ ప్లానింగ్ విభాగం సిబ్బందితో సమీక్షించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం జారి చేసే జీవోలను సిబ్బంది కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఇళ్ల కట్టుకునే వారు ఆన్‌లైన్‌లో ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన సంబంధిత మున్సిపల్ కమిషనర్‌ల కన్ఫర్మేషన్ పొందాలని, లేదంటే భవిష్యత్‌లో ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. గృహ నిర్మాణదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి తీసుకొస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. సక్రమంగా రికార్డులు నిర్వహించని 1వ సచివాలయం సిబ్బందిపై ఆర్‌డీడీ అసహనం వ్యక్తం చేశారు. ఆయన వెంట అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్, ఏఈ ఆదినారాయణ ఉన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

- డ్వామా పీడీ శీనారెడ్డి



ప్రజావేదికపై డ్వామా పీడీ శీనారెడ్డి

రాచర్ల: ఉపాధి పథకంలో పనులు చేసేందుకు కూలీల సంఖ్యను మరింతగా పెంచాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శీనారెడ్డి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం అవరణలో శుక్రవారం సాయంత్రం 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశం ఎంపీపీ షేక్ ఖాశింబీ అధ్యక్షతన నిర్వహించారు. 2021 ఏప్రిల్ నుంచి మార్చి 2022 వరకూ రూ.7 కోట్లతో జరిగిన పనులకు సంబంధించి పంచాయతీరాజ్, వెలుగు, సోషల్ ఆడిట్ కార్యక్రమం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ఉపాధి పథకంలో రెవెన్యూ ప్లాంటేషన్‌లో పనులు చేయగా మండలంలోని చినగాని పల్లె, చోళ్లవీడు, ఆకవీడు, పాలకవీడు, రాచర్ల పంచాయతీల్లో మొక్కలు నాటకుండానే బిల్లులు తీసుకున్నారని, రెవెన్యూ ప్లాంటేషన్‌లో అంతులేని అవినీతి జరిగిందని, పాలకవీడు, జేపీ చెరువు, గౌతవరం గ్రామాల్లో గ్రామ వలంటీర్లు ఉపాధి పనులు కల్పించి బిల్లులు చేశారని పీడీ తెలిపారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాల కోసం ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేసిన సిమెంట్ పక్కాదారి పట్టించారని మండిపడ్డారు. వీటిపై సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా విజిలెన్స్ అధికారి పి.వెంకటస్వామి, షేక్ మీరావలి, ఎంపీడీవో కె.కవితా చౌదరి, ఏపీవో వై.సుజాత, రమణి పాల్గొన్నారు.

కొమరోలు: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ సామాజిక తనిఖీలను గ్రామ పంచాయతీల వారీగా శుక్రవారం నిర్వహించారు. డ్వామా పీడీ శీనారెడ్డి ఆధ్వర్యంలో సామాజిక తనిఖీలు చేశారు. శీనారెడ్డి మాట్లాడుతూ ఉపాధి పనుల్లో అవకతవకలు జరగకుండా సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఎంపీపీ కామూరి అమూల్య, జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు, ఎంపీడీఓ నరసయ్య, ఏపీడీ భాస్కర్‌రావు, ఏపీవో మహాలక్ష్మి పాల్గొన్నారు.

అడవి పంది విషయంలో ఘర్షణ

గిద్దలూరు రూరల్: అడవి పంది విషయంలో అటవీశాఖ అధికారులు, గ్రామస్తులకు ఘర్షణ తలెత్తిన సంఘటన మండలంలోని జయరాంపురం గ్రామ సమీపంలో శుక్రవారం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. జయరాంపురం గ్రామానికి చెందిన తిరుపతయ్య అనే వ్యక్తి పంట పొలాలకు పెట్టిన కరెంట్ తీగ తగిలి అడవి పంది చనిపోవడంతో ఆ పందిని ఒక మూటలో కట్టుకుని సైకిల్‌పై తీసుకెళ్తుండగా ఎఫ్‌ఎస్ఓ జమాల్ అడ్డుకున్నాడు. ఈలోగా గ్రామంలోని కొందరు సంఘటన స్థలం వద్దకు చేరుకుని అటవీశాఖ అధికారితో వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న గుండ్లకమ్మ రేంజర్ జీవన్ వచ్చి అడవి పంది కళేబరాన్ని పోస్టుమార్టం కోసం వెల్లుపల్లె పశువైద్యశాలకు తరలించారు. ఆ తర్వాత గ్రామస్తులు అటవీ కార్యాలయానికి వెళ్లి ఆందోళనకు దిగారు.

మెరుగైన విద్యనందించాలి

- డీఈఓ విజయభాస్కర్

రాచర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని జిల్లా విద్యాశాఖాధికారి బి.విజయభాస్కర్ ఆదేశించారు. మండల కేంద్రం రాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే నాడు–నేడు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మండలంలోని ప్రధానోపాధ్యాయులు, కస్తూరిబా, గురుకుల, మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లతో ఆయన శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రతి ఉపాధ్యాయుడు లెసన్ ప్లాన్ రాసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ట్యాబ్‌లు సకాలంలో పంపిణీ చేయాలన్నారు. అనంతరం కస్తూరిబా బాలికల పాఠశాలను పరిశీలించి ఉపాధ్యాయులకు తగు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో కోటేశ్వరరావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.భాస్కర్‌రెడ్డి, కస్తూరిబా బాలికల పాఠశాల ఎస్‌వో వై.హనుమాదేవి పాల్గొన్నారు.